రేపట్నుంచి స్కూళ్లు రీ ఓపెన్

సోమవారమే తెరుచుకోన్న ఇంటర్ కాలేజీలు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : విద్యాసంస్థలు, విద్యార్థులకు ప్రకటించిన దసరా సెలవుల మజా ముగింపు దశకు చేరుకున్నది. సోమవారం నుంచి రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలు రీ ఓపెన్ కానున్నాయి. ఈ కాలేజీలకు ఈ నెల 6 నుంచి 13 వరకు దసరా సెలవులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక పాఠశాలలు మాత్రం ఈ నెల 15 నుంచి తెరుచుకోనున్నాయి. స్కూళ్లకు 2 నుంచి 14 వరకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. మంగళవారం నుంచి బడులు పునఃప్రారంభం కానున్నాయి.

జెన్‌కోలో పదోన్నతుల పండుగ

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యుత్తు ఉత్పత్తి సంస్థ (టీజీ జెన్‌కో)లో భారీగా పదోన్నతులు కల్పిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో పదోన్నతులు కల్పిస్తూ జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ ఉతర్వులు జారీ చేశారు. ఎలక్ట్రికల్ విభాగంలో ఇద్దరు ఎస్‌ఈలకు చీఫ్ ఇంజినీర్లుగా పదోన్నతులు దక్కాయి. ఏడుగురు డీఈలకు ఎస్‌ఈగా, 34 మంది ఏడీఈలకు డీఈగా, 170 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, 33 మంది ఏఏఈలకు ఏడీఈలుగా పదోన్నతి కల్పించారు. మెకానికల్ విభాగంలోని ముగ్గురు డీఈలకు సూపరింటెండెంట్ ఇంజినీర్లుగా, 12 మంది ఏడీఈలకు డీఈలుగా పదోన్నతులు దక్కాయి. జెన్‌కో డిజిటలైజేషన్ సీఈ శ్రీ ప్రకాశ్‌ను బదిలీ చేసి, కేటీపీపీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సీఈగా పోస్టింగ్ ఇచ్చారు.

పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయండి

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక పాఠశాలలకు ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టును మంజూరుచేసి, బీఈడీ, డీఎడ్ అర్హతలు గల ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని ఎస్జీటీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ కమ్రుద్దీన్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, రాందాస్ ఒక ప్రకటనలో కోరారు. పండిట్ అప్‌గ్రేడేషన్‌తో ఎస్జీటీలు నష్టపోయారని, కావున పీఎస్ హెచ్‌ఎం పోస్టులతో నష్టాన్ని పూడ్చి, వారికి న్యాయం చేయాలని కోరారు.

విషజ్వరంతో వృద్ధురాలి మృతి

మల్లికాంబ (ఫైల్)

ములుగురూరల్, అక్టోబర్ 13: విషజ్వరంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా ములుగు మండలం జంగాలపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లికాంబ (70) మూడు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానలో చూపించగా తగ్గలేదు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

కోతులను తరుముతుండగా ఘటన

రాజేశ్ (ఫైల్)

మాచారెడ్డి, అక్టోబర్ 13 : పంట పొలంలోకి వచ్చిన కోతులను తరుముతుండగా ప్రమాదశవాత్తు విద్యుత్తు తీగ తగలి ఓ బాలుడు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం బండరామేశ్వర్‌పల్లిలో శనివారం చోటుచేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన ప్రకారం.. బండ రామేశ్వర్‌పల్లికి చెందిన సినిగిరి రాజేశ్ (16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పొలంలో కోతులకు కాపలా కోసం వెళ్లాడు. కోతులు రావడంతో వాటిని కర్రతో తరుముతుండగా పంట పొలంలో ఉన్న విద్యుత్తు తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్సై తెలిపారు.

సంగారెడ్డి జిల్లా ఖేడ్ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న సంజీవన్‌రావుపేట్ గ్రామస్తులు

అస్వస్థతకు గురై సంగారెడ్డి జిల్లా ఖేడ్ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కలుషిత నీటికి ఇద్దరు బలి

మొదటిపేజీ తరువాయి...

ఈ సమస్య తలెత్తిందని గ్రామస్తులు చెప్పున్నారు. బావి దుస్థితిని అంచనా వేయకుండానే ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అందులోంచి నీటిని సరఫరా చేయించడం వల్లే ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురయ్యారని ఆరోపిస్తున్నారు. గ్రామంలో 10 బోరు మోటర్లు ఉన్నా కేవలం రెండు మాత్రమే పని చేస్తున్నాయని ఈ పరిస్థితుల్లోనే బావిలోంచి నీటిని సరఫరా చేశారనే విమర్శలున్నాయి.

గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

సంజీవన్‌రావుపేట్‌ను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. ఇంతపెద్ద ఎత్తున గ్రామస్తులు అస్వస్థతకు గురవడానికి బావినీరే కారణమని తెలుసుకొని పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

డీఎంహెచ్‌వో, డీపీవోపై గ్రామస్థుల ఆగ్రహం

ఆదివారం గ్రామాన్ని సందర్శించేందుకు వచ్చిన డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, డీపీవో సాయిబాబాపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించినందునే ఈ సమస్య తలెత్తిందని నిలదీశారు. గ్రామంలో 10 బోరు మోటర్లు ఉన్నాయని, వాటిని ఎందుకు పునరుద్ధరించలేదని మండిపడ్డారు. పై అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగానే ఈ దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కలుషిత నీరు తాగి ఇద్దరు చనిపోతే కలుషిత ఆహారం తిని అస్వస్థతకు లోనైనట్టు చెప్పడమేమిటని మండిపడ్డారు. దీంతో వారు స్పందిస్తూ కలుషిత నీరు తాగడం వల్లే ఈ సమస్య వచ్చిందనే విషయం తమ విచారణలో తేలిందని చెప్పారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడంతో పాటు అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందిస్తామని భరోసా ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

సంజీవన్‌రావుపేట పాపం సర్కారుదే

తాగునీటి సరఫరా ఎందుకు నిలిపివేశారు? వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్‌కావడంతో కలుషిత నీరు తాగి ఇద్దరు మృతిచెందటం, 120 మందికి పైగా అస్వస్థతకు గురవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత కాంగ్రెస్ సర్కారు దేనని ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇంటింటికీ సరఫరా అయిన మిషన్ భగీరథ నీటిని ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. 'తెలంగాణ అంతటా తాగునీటి సరఫరా కోసం కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఏరా స్థంలో లేని విధంగా మిషన్ భగీరథ ప్రాజెక్టు పూర్తిచేసింది. కృష్ణా, గోదావరి నదీ జలాలను శుద్ధి చేసి ప్రజలందరికీ తాగునీరిచ్చే ఈ ప్రాజెక్టును కూడా రేవంత్ సర్కారు సరిగ్గా నిర్వహించలేకపోతున్నది' అని విమర్శించారు. సంజీవన్‌రావుపేట ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని పేర్కొన్నారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, చికిత్స పొందుతున్న వారికి అవసరమైన సాయం అందించాలని, రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి దురదృష్టకరమైన ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చనిపోయిన రైతుకు నోటీసులు

- సింగారంలో రైతులకు మళ్లీ తాఖీదులు
- వడ్డీ చెల్లించాలంటూ హుకుం

అచ్చంపేట/అచ్చంపేట రూరల్, అక్టోబర్ 13 : రుణమాఫీ రైతుల పాలిట శాపంగా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారంలో బ్యాంక్ నోటీసుల పరంపర కొనసాగుతున్నది. వ్యవసాయ రుణాన్ని వడ్డీసహా చెల్లించాలని ఆరు నెలల కిందట చనిపోయిన రైతు బూరం రామచంద్రయ్య పేరిట అచ్చంపేట ఏపీజీవీబీ బ్రాంచ్ నుంచి శుక్రవారం పోస్ట్ ద్వారా నోటీసులు రాగా.. ప్రస్తుతం రామచంద్రయ్య చనిపోవడంతో అతడి భార్య బాలింగమ్మకు పోస్ట్‌మాన్ శివ అందజేశారు. రూ.1.36 లక్షలు వడ్డీ సహా చెల్లించాలని పేర్కొన్నారు. బూరం రామచంద్రయ్యతోపాటు అదే గ్రామానికి చెందిన బోడ అంతయ్యకు నోటీసులు వచ్చాయి. అసలు రూ.1.50 లక్షలు కాగా.. 13 సెప్టెంబర్ 2024 నాటికి వడ్డీ కలిపి రూ 1,71,547.54 చెల్లించాలంటూ తాఖీదులు అందాయి. నోటీసును పంపేందుకు అయిన రూ.59 కూడా ఖాతాలో జమచేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, అనారోగ్యానికి గురి కావడంతో పాటు పండుగకు ఆడబిడ్డ ఊరికి వెళ్లడంతో ఆయన తరపున నోటీసులు ఎవరూ అందుకోలేదు. ఇంత కాలం మాఫీ అవుతుందని ఆశతో ఎదురుచూసిన రైతులకు నోటీసులు రావడంతో అవాక్కవుతున్నారు. వారం క్రితం అచ్చంపేట ఏపీజీవీబీ నుంచి నీలం వెంకటయ్య, గెనమోని జంగయ్య, ఉడుత పార్వతమ్మకు బ్యాంక్ అధికారులు నోటీసులు పంపారు. తాజాగా శుక్రవారం మరో ఇద్దరు రైతులకు నోటీసులు వచ్చాయి. ప్రభుత్వం పండుగపూట రైతుల కంట్లో కన్నీళ్లు వచ్చేలా చేస్తున్నదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ సర్కారులో మాఫీ అయ్యింది: బూరం బాలింగమ్మ (రామచంద్రయ్య భార్య)

బూరం రామచంద్రయ్య 5-మే 2022న రూ.1.36 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. నాటి నుంచి 13 సెప్టెంబర్ 2024 వరకు రూ.4,394 కలిపి అసలు చెల్లించాలని బ్యాంకులు నోటీసులిచ్చాయి. ఏడాది దాటినందున 14 శాతం వడ్డీ చెల్లించాలంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకపోగా బ్యాంకులో ఉన్న అప్పు తీర్చాలని చనిపోయిన వ్యక్తికి నోటీసులు పంపించడం బాధగా ఉన్నది. పండుగపూట రెండు ముద్దలు తిందామంటే ఇలా నోటీసులు పంపి ముద్ద దిగకుండా చేస్తున్నరు.

నోటీసును చూపెడుతున్న బాలింగమ్మ

కానిస్టేబుల్ ఆత్మహత్య

- గంజాయి కేసులో ఇరికించారంటూ సెల్ఫీ వీడియో
- ఏన్కూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

కానిస్టేబుల్ భూక్యా సాగర్

హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ (ఫైల్)

సారపాక, అక్టోబర్ 13: సస్పెండ్ అయిన ఓ కానిస్టేబుల్ కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనను గంజాయి కేసులో ఇరికించారంటూ అంతకుముందు ఆయన సెల్ఫీవీడియో తీసుకున్నాడు. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్ (34) 2013 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. 8 నెలల క్రితం వరకు భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. ఆ సమయంలో బూర్గంపహాడ్ స్టేషన్‌లో గంజాయి మాయమైన ఘటనలో సాగర్‌కు సంబంధం ఉందంటూ అప్పటి పోలీసులు కేసు పెట్టడంతో జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో పోలీసు ఉన్నతాధికారులు సాగర్‌ను సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో దసరా రోజున శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్వగ్రామమైన ఏన్కూరులో కలుపుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తొలుత ఖమ్మంలోని ప్రైవేటు దవాఖానకు, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లో ఓ ప్రముఖ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు.

సెల్ఫీ వీడియో..

ఇదిలావుండగా తన ఆత్మహత్యకు గల కారణాలను సాగర్ ఓ సెల్ఫీ వీడియోలో వివరించాడు. బూర్గంపహాడ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో అప్పటి అధికారులు.. బూర్గంపహాడ్‌కు చెందిన మరో వ్యక్తి ద్వారా బయటి వ్యక్తులతో గంజాయి అమ్మించేవారని ఆ వీడియోలో సాగర్ పేర్కొన్నారు. ఈ కార్యకలాపాలకు తన ఫోన్‌ను వాడుతూ తనను ఆ కేసులో ఇరికించారని, తాను సస్పెండ్ కావడానికి కారకులయ్యారని ఆరోపించాడు. అందువల్లనే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్టు పేర్కొన్నాడు. ఈ సెల్ఫీ వీడియో జిల్లాలో వైరల్ అయింది.

'రేవంతన్నా.. నా భార్యాపిల్లలను కాపాడండి..

'రేవంతన్నా.. నా భార్యాపిల్లలకు, అమ్మానాన్నకు న్యాయం చేయండన్నా. ఈ కేసు విచారణ జరిపించండన్నా' అంటూ చికిత్స పొందుతూ తీసిన మరో వీడియో కూడా ఆదివారం సాయంత్రం విడుదలైంది.

అప్పటి పోలీస్ అధికారులే బాధ్యులు..

సాగర్ ఆత్మహత్యపై ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైనట్టు ఎస్సై రఫీ తెలిపారు. సాగర్ బూర్గంపహాడ్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే సమయంలో అధికారులు సంతోశ్, రాజ్‌కుమార్, సత్యనారాయణ సహా మరో వ్యక్తి నాని కలిసి ప్రణాళిక ప్రకారం గంజాయి కేసులో ఇరికించారని అతని తండ్రి కిషన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కులంపేరుతోనూ దూషించారని తెలిపారు.

కలెక్టరేట్‌లో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

మహబూబాబాద్‌లో గన్‌తో కాల్చుకుని బలవన్మరణం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13: మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద ఆదివారం హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. డీఎస్పీ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గోపాల్‌రావునగర్ కాలనీలో నివాసముంటున్న హెడ్‌కానిస్టేబుల్ (ఏఆర్) గుడిబోయిన శ్రీనివాస్ (59)కు 1990లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. 2016 మహబూబాబాద్ నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత నుంచి ఎస్పీ కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. 2018లో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. అనంతరం కలెక్టరేట్‌లో ఉన్న వీఈఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు డ్యూటీ చేస్తున్నాడు. ఇతని భార్య పదేళ్లుగా విడిపోయి ఉంటున్నది. ఇతడు తల్లితోనే ఉంటుండగా, భార్యతో తరచూ తగాదాలతో మనస్తాపం చెంది తన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ గన్‌తో కాల్చుకుని మృతి చెందాడు. ఇతడికి కుమారుడు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ సందర్శించారు. మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పూర్తి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

నీటిలో మునిగి నలుగురి మృతి

మహబూబ్‌నగర్, భూపాలపల్లి జిల్లాల్లో ఘటనలు

సాయి (ఫైల్) | సాకేత్ ఫైల్ | రాములు (ఫైల్) | హరీశ్ (ఫైల్)

మూసాపేట/టేకుమట్ల, అక్టోబర్ 13 : వేర్వేరు చోట్ల నీటిలో మునిగి నలుగురు మృతి చెందారు. ఈ ఘటనలు మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం స్ఫూర్తితండాకు చెందిన సక్రూనాయక్, జ్యోతికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. శనివారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వారి ఇద్దరు కుమారులు సాయినాయక్ (13), సాకేత్‌నాయక్ (9) వెళ్లారు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో సక్రూనాయక్ పొలం వద్ద వెతికాడు. కనిపించకపోవడంతో తిరిగి వస్తుండగా.. మార్గమధ్యంలో ఉన్న నీటిగుంతలో పరిశీలించగా కుమారులు ఇద్దరూ మునిగిపోయి కనిపించారు. వారిని బయటకు తీసి వెంటనే జిల్లా దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు మూసాపేట ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

చలివాగులో మునిగి ఇద్దరు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని టేకుమట్ల- రాఘవారెడ్డి పేట గ్రామాల మధ్యలోని వంతెన వద్ద చలివాగులో మునిగి ఆదివారం ఇద్దరు మృతి చెందారు. వెల్లంపల్లికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు సొల్లేటి రాములు(45) కుటుంబంతోపాటు గీస హరీశ్ (28), మరికొందరు కలిసి సరదాగా స్నానాలు చేద్దామని చలివాగు వద్దకు వెళ్లారు. రాములు, హరీశ్ వాగు కోతకు గురైన ప్రాంతంలో ఈత కొడుతుండగా లోతుగా ఉన్నచోట ప్రమాదవశాత్తు హరీశ్ పడిపోయాడు. గమనించిన రాములు కాపాడే ప్రయత్నంలో వాగు ప్రవాహానికి ఎదురు ఈదలేక ఇద్దరూ మునిగిపోయారు. వారి కుటుంబసభ్యులు కేకలు వేయగా స్థానికులు, జాలర్లు వెలికితీయగా అప్పటికే మృతి చెందారు.

..ఖాళీ కుర్చీలు

- 'పేట' పామాయిల్ ఫ్యాక్టరీలో విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభం
- పండుగ పూట ఏర్పాటుపై రైతుల కస్సుబుస్సు

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో భట్టి ప్రసంగిస్తుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అశ్వారావుపేట, అక్టోబర్ 13: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో రైతులు లేకుండా రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. సభకు హాజరైన ముగ్గురు మంత్రులకు అన్నదాతలు గైర్హాజరై గట్టిగా షాక్ ఇచ్చారు. దసరా పండుగ రోజున కుటుంబంతో సంతోషంగా గడుపుదామనుకుంటే మంత్రులు సభ ఏర్పాటు చేయడంపై అన్నదాతల ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందే రుణమాఫీ కాకపోవడం, రైతు భరోసా అందక పోవడంతో ఆగ్రహంతో ఉన్న రైతులు సభవైపు తొంగి చూడలేదు. వచ్చిన కొద్దిమందికీ మధ్యాహ్నం 2:15 గంటలు దాటినా మంత్రులు, అధికారులు భోజనాలు పెట్టలేకపోయారు. ఆగ్రహించిన రైతులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలతోనే సభ నిర్వహించాల్సి వచ్చింది. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దసరా పండుగైన శనివారం ప్రారంభించారు. ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు పేరిట భద్రాద్రి, ఖమ్మం జిల్లాల రైతులను అధికారులు బలవంతంగా తరలించారు. ఉదయం 10 గంటలకే మంత్రులు సదస్సును ప్రారంభిస్తారంటూ చెప్పిన అధికారులు.. అంతకు కొన్ని గంటల ముందే రైతులను సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం వరకూ సభ ప్రారంభం కాకపోవడంతో అన్నదాతలకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. మధ్యాహ్నం మధ్యాహ్నం 12:08 గంటలకు మంత్రి తుమ్మల, 12:53 గంటలకు మంత్రి పొంగులేటి, మధ్యాహ్నం 2:14 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి హాజరయ్యారు. అప్పటికే అసహనం, ఆకలితో ఉన్న అన్నదాతలకు ఆ సమయంలో భోజనమూ అందించలేదు. దీంతో రైతులు మండిపడ్డారు. 'మధ్యాహ్నం 2 గంటల వరకు భోజనాల కోసం పడిగాపులు కాయాలా? వేళకు భోజనం చేయకుంటే బీపీ, షుగర్ ఉన్న రైతుల పరిస్థితి ఏంటి?' అంటూ భోజన పేట్లను విసిరేశారు. దీంతో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. పోలీసులు జోక్యం చేసుకున్నా రైతులు పట్టించుకోలేదు. 'పండుగ రోజు ఏంటి మాకు ఈ పరీక్ష? గత్యంతరం లేక ఈ సమావేశానికి వచ్చామా? పండుగ రోజున కుటుంబాలతో ఉండనీయకుండా, సమావేశం పేరిట భోజనాలు కూడా అందించకుండా ఎందుకు పిలిచారు?' అంటూ ఆక్రోశం వెలిబుచ్చారు. దీంతో పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన మంత్రులు, ఎమ్మెల్యే.. 'భోజనాల తర్వాత సమావేశం కొనసాగిద్దాం' అంటూ ప్రకటించారు. అప్పటికే చాలామంది రైతులు ఇంటి బాట పట్టడంతో సభా ప్రాంగణమంతా ఖాళీ అయింది. వర్షం ఊపందుకోవడంతో రైతులు, అధికారులు ఇబ్బందులుపడ్డారు. రైతులు లేక సభ వెలవెలబోయినప్పటికీ ఖాళీ కుర్చీలకే మంత్రులు ప్రసంగాలు వినిపించి సభను ముగించారు.

చిన్నారులను బావిలోకి తోసి తండ్రి ఆత్మహత్య

- ముగ్గురి మృతితో గ్రామంలో విషాదఛాయలు
- కామారెడ్డి జిల్లా నందివాడలో ఘటన

విఘ్నేష్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి , చిట్టెపు శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

లింగంపేట(తాడ్వాయి), అక్టోబర్ 13 : ఇద్దరు చిన్నారులను బావిలోకి నెట్టి ఆపై తండ్రి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. తాడ్వాయి మండలం నందివాడ గ్రామానికి చెందిన చిట్టెపు గుండారెడ్డి - సుగుణ దంపతుల చిన్న కూతురు అపర్ణకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ మండలం నయాగావ్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డితో పదేండ్ల క్రితం వివాహమైంది. శ్రీనివాస్‌రెడ్డిని ఇల్లరికం తెచ్చుకున్నారు. వ్యవసాయ పనులు చేస్తూ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని పోషించేవాడు. అపర్ణ - శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు విఘ్నేశ్‌రెడ్డి (7), అనిరుధ్‌రెడ్డి (5) ఉన్నారు. శనివారం దసరా సంబురాల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి.. రాత్రి 8 గంటల ప్రాంతంలో తన కుమారులను తీసుకొని బయటికి వెళ్లాడు. రాత్రి 10 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్యతోపాటు కుటుంబ సభ్యులు వారి కోసం గాలించారు. ఆదివారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన సెల్‌ఫోన్, చెప్పులను గుర్తించారు. బావిలోకి చూడగా ఇద్దరు చిన్నారుల మృతదేహాలు కనిపించగా.. శ్రీనివాస్‌రెడ్డి ఆచూకీ లభ్యం కాలేదు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారుల మృతదేహాలను బయటికి తీయించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం కూడా లభించింది. కుటుంబకలహాల కారణంగా పిల్లలతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిద్రిస్తున్న భర్తకు ఉరివేసి చంపిన భార్య

- సహకరించిన తల్లి, సోదరుడు
- మహబూబాబాద్ జిల్లా పెనుగొండలో ఘటన

కేసముద్రం, అక్టోబర్ 13: భర్తను కడతేర్చిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండలో ఆదివారం చోటుచేసుకున్నది. గూడూరు సీఐ బాబురావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కడప జిల్లా సింహాద్రిపురం మండలానికి చెందిన లక్క ప్రశాంత్ (30)కు, కడప జిల్లా పులివెందులకు చెందిన అమీనాకు కొన్నేళ్ల క్రితం రెండో వివాహం జరగ్గా, మొదటి సంబంధానికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు పెనుగొండలో ఉంటుండగా, అమీనా తల్లి నూర్జహాన్, సోదరుడు అమీర్‌పాషా అదే ఊర్లో వేరే ఇంట్లో ఉంటున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. ఇద్దరు పిల్లలు తనకు పుట్టలేదని అమీనాను ప్రశాంత్ మద్యం తాగి వచ్చి రోజూ ఇబ్బంది పెడుతుండేవాడు. ప్రశాంత్‌ను హత్య చేయాలని భావించి, తల్లి, సోదరుడి సాయం కోరింది. ఈ నెల 10న తెల్లవారుజామున అమీనాతోపాటు ఆమె తల్లి నూర్జహాన్, సోదరుడు అమీర్‌పాషా కలిసి నిద్రపోతున్న ప్రశాంత్ మెడకు తాడు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని రైల్వే ట్రాక్ మీద పడేసి ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించాలనుకున్నారు. హాస్పిటల్‌కు అని చెప్పి ప్రశాంత్ మృతదేహాన్ని మహబూబాబాద్‌లోని రైల్వే గేట్ వైపు తీసుకుపోవాలని ఆటో డ్రైవర్ రాముకు సూచించారు. అనుమానం వచ్చిన రాము 100 నంబర్‌కు డయల్‌చేశాడు. అమీనా, నూర్జహాన్, అమీర్‌పాషాపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ, ఎస్సై తెలిపారు.